# చైతన్య స్రవంతి

అసలు ఆలోచనల స్వరూపమే అంత----వాటికి అంతంటూ వుండదు. ఒక్కొక్క ఆలోచన యెక్కడ ప్రారంభం అవుతుందో కూడ చెప్పటం కష్టం. చేతిలో యే పుస్తకమో లేక దినపత్రికో పట్టుకుని కులాసాగా పడక కుర్చీలో మేనువాల్చి ఆలోచనల్లోకి దిగితే మళ్ళీ యెవరేనా ఘట్టిగా పిలిస్తేనో, మిన్ను విరిగి మీద పడ్డట్టు శబ్దిస్తేనో తప్ప తిరిగి వాస్తవిక ప్రపంచానికి రాలేము. ఇది అందరి జీవితాల్లోనూ తథ్యమే----కనుక వసుమతి విషయం ఆశ్చర్యజనకం కాదు.

అయితే ఈ ఆలోచనలనేవి అందరికీ కలుగుతాయని కూడా నిరాఘాటంగా చెప్పలేము. ఆలోచన లేని బతుకులు యీదేవాళ్ళు అదృష్టవంతులు. ఎంచేతనంటే వాళ్ళ మనసులకు యిక సమస్యలంటూ దాపురించవు.

వసుమతికి కలిగినటెంగ కొందరికి అసాధారణంగాను, అమానుషంగానూ కూడా కనిపించవచ్చు. సామాన్యంగా మనుషులు కోరేవి సుఖమైన జీవనం, దాంపత్యం, అరమరికలు లేని ఆనందం, సంసారం... యిత్యాది. వీటన్నిటికీ వసుమతి యేమంత దూరంగా లేదు. సొంత డాబా యిల్లు. స్విచ్చి నొక్కితే వెలిగే దీపాలు, మర తిప్పితే వచ్చే జలధారలు, దేవుడులాంటి భర్త - పండంటి ఇద్దరు పిల్లలు. కాకితో కబురంపితే మరుక్షణంలో వచ్చివాలే తండ్రి---- ఇంతకన్నా మరేం కావాలి?----అంటారు. కాని వసుమతి వుద్దేశాలే వేరు. వాటి అద్యంతాలూ ఆచరణ కరణాలూ మరో పంథా.

జీవితంలో వున్న ఆనందం యేమిటో వసుమతికి అర్థంకాదు. బాధ్యతలు నెత్తిన వేసుకుని వుసులుబాటు లేకుండా తిరిగే జనమంతా యేం చేస్తున్నట్లు? యెవర్ని వుద్ధరిస్తున్నట్లు?

సంసారంలో వర్ణనాతీతమైన ఆనందం వున్నదనీ, దానితోనే జన్మలు తరించి పోతాయని విన్నమాటలు, నమ్మినమాటలు కలలేనా? అనుకున్నవన్నీ నిజం అయే రోజులు కావాయివి?

ఇంతమంది జనం యెందుకు పుట్టినట్లు? ఇన్ని మహానగరాలు యెందుకు కట్టినట్టు? ఇన్ని మార్గాలూ దోవలూ యెందుకేర్పరచినట్టు? ఏమిటీ జగన్నాటకం, దాన్లో అంతా వేస్తున్న వేషాలూ?

బ్రతుకుతున్నది ఒక్కమనుషులే కాదు. సమస్తజీవాలూ, ఎన్నోరూపాల్లో, ఎన్నో ఆకారాల్లో పందులనీ, కుక్కలనీ, నక్కలనీ, గుడ్లగూబలనీ పేర్లు పెట్టుకుని భూమిమీద తిరుగుతూ యేం సాధిస్తున్నట్టు?

సూర్యుడితోనే బ్రతుకంతా తెల్లవారుతున్నట్లు పొద్దున్నే లేవటమూ కాలకృత్యాలంటూ యేవేవో పన్లు చేసుకుని యింత వుడకేసుకుని తినటమూ, మళ్ళీ సాయంత్రం అయి చీకటిరేఖలు భూమిని గాఢంగా కౌగలించుకోగానే పక్కలమీద పడి దొర్లటమూను! ఏమిటి సార్థక్యం? అసలు యెవడు నేర్పిన వీ చర్యలన్నీ ?

వసుమతి తీవ్రంగా ఆలోచిస్తున్నది---- పుట్టినందుకు ఒక్కొక్కడూ---- అంటే ఒక్కొక్క ప్రాణీ యేం చేస్తున్నట్లు? పుట్టుట గిట్టుట కొరకేనా?----అయితే గిట్టుట యెందుకొరకు?

రోజులు గడవగా గడవగా దినచర్య మీదకూడ విసుగెత్తి పోతోంది. జీవితమే హేయం, తుచ్ఛం అనిపిస్తుంది. గ్రామఫోను రికార్డులాగ, గారడీవాని చేతిలో కర్రలాగా, యే రోజునా చేసే పనులన్నీ ఒకటే తీరు, ఒకేక్రమం, ఒకే ఒకటి! బ్రతకటంకోసమే బ్రతుకు తున్నామా? మరి ఏమిటి మాధుర్యం, ఆహ్లాదం, ఉచ్ఛమూ, నీచమూ అని వేదాంతాలూ, తత్వాలూ చెబుతారు?

తతిమా ప్రపంచం అంతా తనకు అర్థంకాదు. దానికీ ప్రమాదం లేదు. కాని తన సంగతేమిటి? తను చేస్తున్న ఘనకార్యాలేమిటి? వసుమతికి ఆత్మ విమర్శ లావయింది.

ఎక్కడో పుట్టింది. యెట్లానో పెరిగింది. పెండ్లయి కాపురం ప్రారంభించింది---- అప్పుడే యిద్దరు బిడ్డల తల్లి కూడా అయింది---- ఇంతా చేస్తే తనకి ఇరవైయేళ్ళన్నా నిండలేదు. రోజులూ, వారాలూ, నెలలూ, సంవత్సరాలుగా యిట్లాగే జీవితం అంతా గడిచి పోతుంది. పోతే చరిత్రలో వసుమతి అనేజీవి యెందుకు పుట్టిందీ? యేమిచేసి చచ్చిపోయిందీ? యేమీ మిగలదు. కాదనుకుంటే, తను చేయగలిగిన పనల్లా యీ భూమి మీదకి మరో యిద్దరు పిల్లలను పంపిస్తుంది. వాళ్ళవల్ల మాత్రం యేమవుతుంది - యెవరు మాత్రం యేం చేస్తున్నారు కనక ?---- వాళ్ళూ తనలాగే పెరుగుతారు. పెండ్లిండ్లు చేసుకుంటారు. పిల్లల్ని కంటారు. జీవితాలు చాలిస్తారు.

అంతేనా? మానవ జీవితాలకు సార్థక్యం అంటూ యేమీ ఉండదా?

వసుమతి ఆలోచనలకు సందేహాలకూ జవాబులు యెవరు చెబుతారు? వాటికి జవాబులంటూ యేమయినా ఉంటాయా? అసలు----ఏమో తెలియదు.

ఏడుగంటలయంది. ఇంకా పిల్లలు లేవలేదు. కాని వసుమతి మాత్రం అప్పుడే పనుల్లో మునిగి పోయింది. కాఫీకాచి ఆయనకు అందిస్తూ ''యివాళ యేం చెయ్యమంటారు?'' అనడిగింది. ఈ రోజే కాదు, అనుదినమూ జరిగేదింతే. ''ఏం చేయమంటారు?'' అని వసుమతి అడగందే అతనేమీ చెప్పడు. చెప్పని పనేదీ వసుమతి చెయ్యదు. మనుషులంతా అలవాట్లకు బానిసలా? ----మరో ప్రశ్న వసుమతికి.

పిల్లలను నిద్రపక్కలమీంచి లేవదియ్యటానికి కొంతకాలం హరించుకుపోతుంది. వాళ్లకు ముఖాలు కడిగి స్నానం చేయించి బట్టలు తొడిగి అన్నంపెట్టాలి. ఆపైన తను స్నానంచేసి వంట చెయ్యాలి. తన వంట పూర్తికాకుండా గడియారం పదిగంటలు కొట్ట రాదు (ఇంతవరకెన్నడూ అట్లా జరగలేదు మరి!) తనూ, ఆయనా కలిసి భోజనం చేస్తారు. కాసేపు నిద్ర. ఎండవేళప్పుడు యేమీ చెయ్య బుద్ధికాదు. ఆలోచనలు ఒకదాని వెంట ఒకటి కలిగి ప్రపంచమూ నిజస్థితే మరిచిపోతుంది. తిరిగి సాయంత్రం కాగానే యధాప్రకారంగా యింటిపనులు.

ఇంతేనా? జీవితంలో తను చేస్తున్నదంతా చాకిరీయే, మరేమీకాదు. ఎందు కోసం చేస్తూన్నది యిదంతా?---- ఇట్లా తెలియని అర్థంకాని అలవాట్లకు తనెట్లా దాసో హందేసి గులాం అయిపోయింది? ఇల్లు ఊడ్చుకోవటం, పొయ్యి అలుక్కోవటం, పిల్లల గుడ్డలు తీసిపారెయ్యటం, వాళ్లకు జబ్బులుచేస్తే మందులుకలిపి పొయ్యటం, వాళ్ళకో

సం దిగులుపడి కళ్ళల్లో నీళ్లు కుక్కుకోవటం, ఆయన రాత్రివేళ యింటికి రావటం ఆలస్యం అయితే గుండెలు బద్దలయిపోయేంత బలహీనంగా అవటం – యింతేనా? యింత కన్నా తను సాధించగలవి యేమీ లేవా?

తను బాధపడుతున్నట్టుగానే ఆయనా యిదవుతున్నారా? అడిగితే యేమంటారు? ''ఎందుకొచ్చిన ఆలోచనలు వసుమతీ? జీవితం అంటే అర్థంకాని మహాసముద్రం అనుకో. దాన్లో మన పడవ సజావుగానే నడుస్తూంది. ఇక భయపడాల్సిన అవసరం మనకేమిటి? సంపాదిస్తున్న నాలుగు రాళ్ళతోనూ చీకూ చింతా లేకుండా కాలం గడుపు కోలేమూ?'' అని. కాని వసుమతి అడగుతున్నదేమిటి? తన బాధను ఆయనే అర్థం చేసుకోలేక పోయింతరవాత యేం లాభం? పోతే మిగిలేది తెలిసినవాళ్ళుంటూ వున్నారా అన్న సమస్యే. వసుమతి యింకా ఆ సంగతి ఆలోచిస్తూనే వుంది. అట్లా ఆలోచిస్తోనే వుంటుంది కూడా. అందులో సందేహంలేదు. ❋

*(ఆంధ్ర ప్రభ – సచిత్ర వార పత్రిక)*